

నివాళులర్పిస్తున్న టీజేఎస్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్, విజయ్, నవీన్, నర్సింహ, నందు, సత్యనారాయణ, డానియేల్



చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్



నగర కేంద్ర గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న గ్రంథాలయ కార్యదర్శి పద్మజ, చంద్రకళ, మదన్‌మోహన్, విద్యార్థులు

తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటి చెప్పిన
వీరనారి చాకలి ఐలమ్మ

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



కవాడిగూడలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వి.శ్రీనివాస్‌రెడ్డి, నేతలు



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి,నాయకులు

కవాడిగూడ: తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటి చెప్పిన తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ అని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద తెలంగాణ రజక (ధోబీ) అభివృద్ధి సంస్థ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ ఎం. నర్సింహ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, రాంనగర్ మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఇందిరాశోభన్ హాజరై ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ... తెలంగాణ తొలి మలిదశ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితోనే కొనసాగించినట్లు తెలిపారు. ఆమె ఆశయ సాధన కోసం నేటి పాలకులు, యువత పాటుపడాలని ఆయన సూచించారు.

◆ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... చాకలి ఐలమ్మ లాంటి తెలంగాణ సాయుధ పోరాట యోధురాలును నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోని వారి హక్కులకోసం నిరంతరం పోరాటం చేయాలని ఆయన సూచించారు. చాకలి ఐలమ్మ పోరాట పటిమను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోని హక్కులకోసం పోరాడాలని ఆయన పేర్కొన్నారు.

◆ సంస్థ అధ్యక్షుడు బొమ్మరాజు కృష్ణమూర్తి , మందలపు గాంధీ, ఎం.నర్సింహా మాట్లాడుతూ... చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక (ధోబీ) అభివృద్ధి సంస్థ రాష్ట్ర కార్యదర్శి బొడ్డుపల్లి చుక్కయ్య, ప్రధాన కార్యదర్శి బి. చంద్ర మోహన్, స్థానిక ధోబిఘాట్ అధ్యక్షులు సాయి సత్యనారాయణ, బీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, సిరిగిరిశ్యామ్ కుమార్, వల్లాల శ్రీనివాస్ యాదవ్, కల్వగోపి, బల్లేకారి రమేష్, బీజేపీ నాయకులు జి. వెంకటేష్, మహేందర్‌బాబు తదితరులు హాజరయ్యారు.

ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలి..

చిక్కడపల్లి: టీజేఎస్ డివిజన్ బీసీసెల్ అధ్యక్షుడు గడ్డం శంకర్ ఆధ్వర్యంలో తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీజేఎస్ నియోజకవర్గం కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమలవేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె ప్రదర్శించిన ధైర్య సాహసాలు ప్రజాస్వామిక పోరాటలకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. యువత ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు విజయ్, నవీన్, నర్సింహ, నందు, సత్యనారాయణ, డానియేల్ తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ గారి జయంతి...

చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం సంస్థలో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.పద్మజ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భగా పి.పద్మజ మాట్లాడుతూ... చాకలి ఐలమ్మ నిజాం రాజు, దొరలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ధీరవనిత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిటీ సెంట్రల్ లైబ్రరీ గ్రేడ్-1 గ్రంథపాలకురాలు చంద్రకళ, సిటీ సెంట్రల్ లైబ్రరీ గ్రేడ్-1 గ్రంథపాలకుడు జి.మదన్‌మోహన్, హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ కార్యాలయ సిబ్బంది, టెక్నికల్ సెక్షన్ సిబ్బంది, సిటీ సెంట్రల్ లైబ్రరీ సిబ్బంది పాఠకులు పాల్గొన్నారు.

నవ యువక రజక సంఘం ఆధ్వర్యంలో...

నల్లకుంట: అంబర్‌పేట నవ యువక రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా వద్ద తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి సతీమణి కావ్యారెడ్డి అక్కడ ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతారావు, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతం రావు, గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, మాజీ కార్పొరేటర్ పులి జగన్, దిడ్డి రాంబాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గరిగంటి రమేష్, నవ యువక రజక సంఘ అధ్యక్షుడు మాచర్ల అర్జున్, ఉపాధ్యక్షుడు సంతోష్, కోశాధికారి రాజేష్, బాలు, అభి, రాఘవేంద్ర, ఎం.సాయి రామ్, చందు, ఈశ్వర్, శ్రీనివాస్, స్వామి, టి. మహేష్, కె.రాజశేఖర్, ఎన్. రాజు, సోమరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ ధైర్య సాహసాలను పునికిపుచ్చుకోవాలి



ఫీవర్ ఆస్పత్రి సమీపంలోని నిత్య జనగణమన కేంద్రం వద్ద నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

ఫీవర్ ఆస్పత్రి సమీపంలోని నిత్య జన గణ మన కేంద్రంలో సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి రజక సంఘం నాయకులు నడిగోటి సైదులు, బి. శ్రీనివాస్ నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... తెలంగాణ చరిత్రను మలుపు తిప్పిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఆ రోజుల్లో నిజాం నిరంకుశత్వాన్ని ప్రశ్నించి.. దొరల పెత్తనాన్ని ఎదురించి సాయుధ పోరాటంలో పాల్గొనే వారికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఐలమ్మ ధైర్య సాహసాలను ప్రతి ఒక్కరూ పునికిపుచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేలంటి మధు, వందే ప్రజ శ్రీనివాస్, ఉపేంద్ర ప్రసాద్ దుబె తదితరులు పాల్గొన్నారు.

బధిరుల అభివృద్ధికి కృషి చేయాలి



కేకను కట్ చేస్తున్న డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్ నాయకులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రభుత్వం చిత్తశుద్ధితో బధిరుల అభివృద్ధికి కృషి చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటమోని వెంకటేష్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని సొసైటీ ఫర్ ద డెఫ్ కార్యాలయంలో అంతర్జాతీయ బధిరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం వారు మాట్లాడుతూ... సమాజంలో వినికిడి లోపం కలిగిన వారు తీవ్రంగా వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 22 భాషలు ఉన్నాయని అందులో 23వ భాషగా బధిరుల భాషను చేర్చాలని కోరారు. బధిరుల విద్యా అభివృద్ధి కోసం సైన్ లాంగ్వేజ్‌ను పాఠశాలలో ఏర్పాటు చేయాలని అందుకు ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక టీచర్‌ను నియమించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రేమ్‌కుమార్, సత్యనారాయణ, వాసుదేవరావు, చుక్కయ్య, మనీషా తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై హైడ్రా దృష్టి సారించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఫుట్‌పాత్ ఆక్రమణలపై హైడ్రా దృష్టి సారించాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డవలప్‌మెంట్ కౌన్సిల్ (ఈపీడీసీ) అధ్యక్షుడు ఎస్‌సీహెచ్ రంగయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆక్రమణదారులు పెట్రేగిపోవడంతో వాహనాల రద్దీతో కాలుష్యం విపరీతంగా పెరుగుతోందన్నారు. నగర అంతర్గత ఆక్రమణలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతగా వ్యవహరించడం లేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ చెరువులు పునరుద్ధరణకు హైడ్రాను తీసుకురావడం అభినందనీయం అని అదే లక్ష్యంతో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను అడ్డుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విచక్షణ రహితంగా చెట్లను నరికివేస్తున్న అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు.

28న అక్కినేని మీడియా ఎక్సలెన్సీ అవార్డ్స్

చిక్కడపల్లి: సీల్‌వెల్ కార్పొరేషన్, ఆర్ఆర్ ఫౌండేషన్, ఆదర్శ ఫౌండేషన్, శృతిలయ ఆర్ట్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు బండారు సుబ్బారావు, భీమ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వివేక్‌నగర్‌లో గురువారం సాయంత్రం వారు మాట్లాడుతూ.. సీల్‌వెల్ - శృతిలయ అక్కినేని మీడియా ఎక్సలెన్సీ అవార్డ్స్-2024ను ప్రముఖులకు ప్రదానం చేస్తామన్నారు. త్యాగరాయగానసభలో ఈనెల 28న సాయంత్రం ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

సత్తాచాటిన జీవీఆర్ విద్యార్థులు

కాచిగూడ: ఎస్‌జీఎఫ్ ఇంటర్ స్కూల్ రాష్ట్ర స్థాయి కరాటే ఎంపిక పోటీలు సెప్టెంబర్ 23 నుంచి 25వ తేదీ వరకు ఎల్‌బీ స్టేడియంలో జరిగాయి. ఈ పోటీలలో కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు 5 పతకాలు సాధించారు. రెండు బంగారు, ఒక కాంస్యం, రెండు రజత పతకాలను కై వసం చేసుకున్నారు. బంగారు పథకాలు సాధించిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు అర్హత సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ డా. జీఎస్ గోపాల్‌రెడ్డి, నర్సింగరావు, వెంకట్ రమణ, రాజేశ్వరి చౌహాన్, బాలాజీ, ప్రశాంత్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి



తెలంగాణ మజ్దూర్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతు ముదిరాజ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆర్టీసీని వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాలని దానికి సంబంధించిన తేదీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. హనుమంతు ముదిరాజ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు అనుబంధంగా ఉంటూనే తాము స్వతంత్రంగా పోరాటం చేస్తామన్నారు. కార్మికులపై పెంచిన పనిభారాన్ని వెంటనే తగ్గించాలని, సంస్థలో ఖాళీలను భర్తీ చేయాలని, అక్రమంగా సస్పెండ్ చేసిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్రీద్ అనలైజ్ పేరుతో ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయకుండా చర్యలు తీసుకోవాలి అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేపడుతామని అందుకు త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ఉపాధ్యక్షులు టీడీవీకే రావు, ఉపాధ్యక్షులు ప్రేమ్‌నాథ్, సహాయ కార్యదర్శి గోలి రవీందర్, స్వాములయ్య, కళ్యాణి, జె. వెంకటేశ్వర్లు, ఆర్ఎస్ రావు, అతిక్, పీకే మూర్తి, నాగేంద్ర, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

చిలకమర్తి లక్ష్మీనరసింహం గొప్ప సంఘ సంస్కర్త

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి



సన్నిధానం నరసింహశర్మకు సాహితీ పురస్కారం ప్రదానం చేస్తున్న కేవీ రమణాచారి

చిక్కడపల్లి: చిలకమర్తి లక్ష్మీనరసింహం గొప్ప రచయిత, సంఘ సంస్కర్త అని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి అన్నారు. గురువారం రాత్రి కిన్నెర ఆర్ట్ థియేటర్స్, గానసభ సంయుక్త ఆధ్వర్యంలో చిలకమర్తి లక్ష్మీనరసింహం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త సన్నిధానం నరసింహశర్మకు కిన్నెర - చిలకమర్తి స్మారక సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ''భరత ఖండంబు చక్కని పాడియావు హిందువులు లేగ దూడలై ఏడ్చుచుండ'' పద్యాన్ని బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా రాసి స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను చైతన్య పరిచారన్నారు. ఆయన వెలువరించిన సాహిత్యం నాటి సమాజాన్ని ఎంతో ప్రభావితం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, కిన్నెర మద్దాలి రఘురాం, డాక్టర్ భారతి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళన విస్మరించిన చరిత్ర బీఆర్‌ఎస్‌ది

- ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే పనిలో బీఆర్‌ఎస్
- 12వేల అక్రమ నిర్మాణాలు ఉన్నాయని గుర్తించింది వాళ్లే
- ఖైరతాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే దానం నాగేందర్
- అంబర్‌పేట మూసీనదిపై ఉన్న ఎస్‌టీపీ పరిశీలన





అంబర్‌పేటలో సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

అంబర్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలను రెచ్చగొట్టి చవకబారు రాజకీయాలను చేస్తోందని ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సెంటిమెంట్‌ను ఆసరాగా చేసుకుని అమాయక విద్యార్థులను బలిగొన్నారని విమర్శించారు. మూసీ ప్రక్షాళన, చెరువుల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటే ఓర్వలేక మాజీ మంత్రులు కేటీఆర్,హరీష్‌రావు జీర్ణించుకోలేక బాధ్యత రాహిత్యంగా మాట్లాడుతున్నారని అన్నారు.గురువారం ఖైరతాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లతో కలిసి అంబర్‌పేట మూసీనదిపై ఉన్న సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) లను ఆయన పరిశీలించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత హయాంలో 28 ఎస్‌టీపీలకు శంకుస్థాపన చేసి 5 కూడా పూర్తి చేయలేదని దానం నాగేందర్ విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిర్మించిన ఎస్‌టీపీలే పని చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, పులి జగన్, టీపీసీసీ నాయకులు శుభల శ్రీకాంత్‌గౌడ్, కోటం అనిల్, రమేష్, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళన ఎందుకు అంటే ఎంఆర్‌డీఏను ఎందుకు ఏర్పాటు చేశారు?

మూసీ ప్రక్షాళన ఎందుకు అంటే మూసీ రివర్ డెవలప్‌మెంట్ అథారిటీని ఎందుకు ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే దానం ప్రశ్నించారు. మూసీ నదిని అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పిస్తే కేటీఆర్ ఎందుకు అని ప్రశ్నించడం దారణమన్నారు. మూసీ అభివృద్ధి కోసం ప్రత్యేక సంస్థను బీఆర్‌ఎస్ హయంలో ఏర్పాటు చేసి అందులో 12 వేల అక్రమ నిర్మాణాలు ఉన్నాయని గుర్తించిందన్నారు. రూ.10వేల కోట్లు కేటాయిస్తామని ఒక్క పైసా కూడా మూసీ అభివృద్ధికి ఇవ్వలేదని దుయ్యబట్టారు. అభివృద్ధిపై నిర్మాత్మక సలహాలు ఇవ్వాలని, చావుకబారు ఆరోపణలు చేయవద్దని ఆయన సూచించారు.

మూసీ బాధితలకు భరసా ఇచ్చేందుకు కలెక్టర్‌కు ఆదేశాలు...

మూసీ అభివృద్ధి కోసం పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వ అన్యాయం చేయదన్నారు. బాధితులకు న్యాయం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇప్పిస్తామన్నారు. బాధితులకు జవాబుదారిగా ఉండేందుకు రెవెన్యు అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులందరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇస్తామన్నారు.

అన్నదానం

ముషీరాబాద్: నర్సమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ముషీరాబాద్ చౌరస్తా సమీపంలో ట్రస్ట్ చైర్మన్ త్రినాథరావుశర్మ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నోటుబుక్స్, ఆపదలో ఉన్న వారికి నిత్యావసర కిట్లు,ఆస్పత్రిల వద్ద అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. పేద ప్రజలు నివసించే మురికివాడ ప్రాంతాల్లో సామాజిక బాధ్యతతో పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

క్రీమ్ బిస్కెట్ ఇచ్చారు.. నగలు, నగదు దోచుకెళ్లారు!

నలుగురిని అరెస్ట్ చేసిన కాచిగూడ రైల్వే పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావేద్, రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప

కాచిగూడ: జల్సాలకు అలవాటు పడి రద్దీగా ఉన్న రైళ్లను ఎంచుకొని దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావేద్, కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.

◆ లక్నోలోని రాజమ్‌పూన గ్రామానికి చెందిన సురేందర్ (33), అంబర్‌పేటలోని రహత్‌నగర్ ప్రాంతానికి చెందిన జాన్ మహ్మద్‌చౌదరి (37), ఉత్తరప్రదేశ్‌కుచెందిన క్రిశ్‌కుమార్ (22), దీలిప్ వర్మ (19) చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈనెల 18వ తేదీన బెంగళూర్‌కు వెళ్లడానికి సిద్ధేశ్ అనే వ్యక్తి కాచిగూడ రైల్వే స్టేషన్‌లో మైసూర్ రైలులో జనరల్ బోగి ఎక్కాడు. ఈ నలుగురు వ్యక్తులు మాటమాట కలుపుతూ మత్తు క్రీమ్ బిస్కట్‌లను సిద్ధేశ్‌కు ఇచ్చి 7తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేలు దోచుకెళ్లారు.

◆ మత్తు నుంచి తేరుకుని బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఆ నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించారు. చేసిన దొంగతనం ఒప్పుకోవడంతో వారి వద్ద నుంచి 6 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రైల్వే ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే హెడ్ కానిస్టేబుల్ బీసీ ప్రసాద్ రావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అశోక్‌నగర్‌లో కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి సభ

హాజరుకానున్న ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం

చిక్కడపల్లి: అశోక్‌నగర్‌లో చౌరస్తాలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సభ అశోక్‌నగర్‌లో నిర్వహించనున్నట్లు టీజేఎస్ గ్రేటర్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య తెలిపారు. అశోక్‌నగర్‌లోని ఆయన విగ్రహం వద ఉదయం 10గంటలకు జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం హాజరవుతారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులు, టీజేఎస్ నాయకులు, కొండా లక్ష్మణ్‌బాపూజీ అనుచరులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా గుజ్జ సత్యం

కాచిగూడ: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా గుజ్జ సత్యం నియామితులయ్యారు. ప్రధాన సలహాదారులుగా ఆర్.కృష్ణయ్య, ముఖ్య సలహాదారులుగా గుజ్జ కృష్ణ, ఎర్ర సత్యనారాయణ, లాల్ కృష్ణ, కోల జనార్దన్, నారని నరేందర్, గుండేటి శంకర్, వైస్ చైర్మన్‌లుగా లక్ష్మీనారాయణ, నీలం వెంకటేష్‌తో పాటు పలువురు, కన్వీనర్లుగా అనంతయ్య, వంశీకృష్ణ తదితరులు నియమితులయ్యారు. ఈనెల 27వ తేదీన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ గుజ్జ సత్యం తెలిపారు.

'దామగుండం రిజర్వ్ అడవుల్లో రాడార్ స్టేషన్ ఏర్పాటు సరైంది కాదు'

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: దేశ భద్రత పేరుతో భారత నౌకాదళం దామగుండం రిజర్వ్ అడవుల్లో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రం వద్ద అంబేడ్కర్ కళాశాల విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. దామగుండం ఒక ప్రకృతి దామం అని దానిని కాపాడుకోవాలన్నారు. వణ్యప్రాణులు, ఔషధ మొక్కలు నరికివేయడం సరైంది కాదని పేర్కొన్నారు. పర్యావరణాన్ని దెబ్బతీసే ఇలాంటి చర్యలను అడ్డుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ రాకేష్, కాలేజీ విద్యార్థులు సురేష్, నరేష్, లహరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో గోశాలలు ఏర్పాటు చేయాలి

కాచిగూడ: దేశ వ్యాప్తంగా ఉన్న దేవాలయాలకు అనుబంధంగా గోశాలలు ఏర్పాటు చేయాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. షిర్డీ సాయిబాబా సేవా సమాజ్ నిర్వహిస్తున్న గోశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ ఆధ్వర్యంలో గురువారం గోవులకు పశుగ్రాసం అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ ప్రతినిధులు ప్రేమ్‌చంద్ మునోద్, మంజుల మునోద్, విక్రమ్ చాండక్, గోశాల ప్రతినిధులు రాంకోటేశ్వర్ రావు, చాకీ రాజు, కోటిరాజు, ఆశీన్ సోని, ద్వారక తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లో నిధులు మంజూరై నిర్మాణ పనులు చేపట్టకుండా పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. గురువారం ముషీరాబాద్ డివిజన్‌లోని మోహన్‌నగర్, జాంభవినగర్‌లో రూ.4.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల అధ్వానపు రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నిధులు మంజూరైన ప్రాంతాలలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎన్నికలకు ముందు మంజూరైన అభివృద్ధి పనులు నేటికి ప్రారంభం కాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్, నాయకులు రవీందర్, చారి, వెంకటేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శిగా గణేష్

ముషీరాబాద్: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) కార్యదర్శి గణేష్ తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన పీడీఎస్‌యూ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కందుకూరి గణేష్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందజేశారు. విద్యార్థుల సమస్యలపై విద్యార్థి సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

అభివృద్ధి పేరిట ఉపాధిపై దెబ్బకొట్టొద్దు

అంబర్‌పేట: మూసీ అభివృద్ధి పేరిట నదికి ఆనుకుని ఉపాధి పొందుతున్న వారి పొట్టకొట్టవద్దని సీపీఎం నగర నాయకులు ఎం.మహేందర్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం అలీకేఫ్ చౌరస్తా హోల్‌సేల్ చికెన్ మార్కెట్ గల్లీలో చిరు వ్యాపారులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల జీవితాలను ఆగం చేస్తుందని, బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేసిన తర్వాతే మూసీని అభివృద్ధి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక్కడ కుల్చివేతలు చేపడితే చిరు వ్యాపారాలు, చిన్న చిన్న పరిశ్రమలు మూతపడతాయని, వాటిలో పనిచేస్తున్న వారు ఉపాధి కోల్పోతారన్నారు.

ఖోఖో, కబడ్డీ టోర్నమెంట్ పోటీలు ప్రారంభం

ముషీరాబాద్: ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని పాఠశాల విద్యార్థులకు ముషీరాబాద్ జోన్ ఇంటర్ స్కూల్ ఖోఖో, కబడ్డీ టోర్నమెంట్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ ప్రభుత్వ విద్యామండలి కార్యదర్శి శ్రీలత మాట్లాడుతూ.. శనివారం ఖోఖో, కబడ్డీ ఫైనల్ పోటీలు జరుగుతాయన్నారు. విద్యార్థులను విద్యతో పాటు క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఈ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్నామని వివరించారు. ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఈఓలు చిరంజీవి, జయలక్ష్మి, భారతి, డిప్యూటీ ఐఓఎస్ బాలరాజు, టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీదేవి, జ్యోతిశ్రీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ కానుకల లెక్కింపు

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన మహంకాళి దేవాలయానికి సంబంధించిన కానుకలను భద్రపరిచిన అల్మారాను గురువారం తెరిచి దేవాదాయ శాఖ ఈవోలు జ్యోతి, మహేందర్ కుమార్‌ల పర్యవేక్షనలో లెక్కించారు. నాలుగు సంవత్సరాల క్రితం ఆలయ ఈవోగా పని చేసిన రాంరెడ్డి గుండెపోటుతో మృతి చెందడంతో అప్పటి నుంచి అమ్మవారి కానుకలకు సంబంధించిన అల్మారాను తెరవకపోవడంతో ఆలయం కమిటీ దేవాదాయ శాఖకు లేఖరాసింది. స్పందించిన ఉన్నతాధికారులు అల్మారా తెరిచేందుకు అనుమతి ఇవ్వడంతో ఈవోల సమక్షంలో అల్మారాను తెరిచి కానుకలను లెక్కించారు. అందులో వెండి, బంగారం, పట్టువస్త్రాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.